ప్రజాశక్తి
శుక్రవారం 17 నవంబర్ 2023 5 శ్రీ సత్యసాయి





వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

సాగుదారులకు పట్టాలివ్వండి : వ్యకాసం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పేదల స్వాధీన అనుభవంలో ఉన్న ప్రభుత్వ వ్యవసాయ సాగు భూములకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూపంపిణీలో అసైన్మెంట్ హక్కులు కల్పించాలని శ్రీసత్యసాయి జిల్లా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వ్యకాసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, పెద్దన్నలు గురువారం నాడు విజయవాడలో భూపరిపాలన ముఖ్య అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో భూములు లేని దళిత, గిరిజన, బలహీన వర్గాల నిరుపేద కుటుంబాలు దశాబ్దాలు తరబడి ప్రభుత్వ అసైన్‌మెంట్ మిగులు భూముల్లో సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూములను సాగులోకి తెచ్చేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేశారన్నారు. ఇలాంటి వారికి ఆ భూమిపై హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయాలన్నారు. రొద్దం మండలం కోగిర రెవెన్యూ పొలం సర్వే నెం. 669, గొందిపల్లి రెవెన్యూ పొలం సర్వే నెం164, సోమందేపల్లి మండలం పందిపర్తి రెవెన్యూ పొలం సర్వే నెం.384, తుంగోడు రెవెన్యూ పొలం సర్వే నెం. 28, లేపాక్షి మండలం కొర్లకుంట, కొండూరు తదితర ప్రాంతాల్లో పేద సాగుదారులు సాగులో ఉన్నారన్నారు. ఇప్పటికే పేదలకు న్యాయం చేయాలని జిల్లాలోని రెవెన్యూ సంబంధిత అధికారులందరికీ వినతిపత్రాలు అందిచామన్నారు. ఈ మేరకు రైతులను గుర్తించి వారందరికీ సాగు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



కాయ్‌రాజాకాయ్..!

- ఉమ్మడి జిల్లాలో జోరుగా క్రికెట్ బెట్టింగ్
- పెద్ద ఎత్తున నష్టపోతున్న యువత
- ఆన్‌లైన్‌లోనూ మాయా జూదం
- పోలీసు నిఘా ఉన్నా నియంత్రించలేని స్థితి
- ఫైనల్ మ్యాచ్‌లో భారీగా నగదు చేతులు మారే అవకాశం..?

ప్రస్తుతం ఎక్కడ చూసినా క్రికెట్ ఫీవర్ కన్పిస్తోంది. క్రికెట్‌లో అత్యుత్తమంగా చెప్పకునే వరల్డ్ కప్ పోటీలు ముగింపు దశకు వచ్చేశాయి. అందులోనూ ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం నాడు ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ క్రికెట్ గురించే మాట్లాడుకుంటున్నారు. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా, ఇందులో బెట్టింగ్ మహమ్మారి ప్రవేశించి యువతను పెడదోవ పట్టించేస్తోంది. అక్కడ వాళ్లు ఆట ఆడుతుంటే ఇక్కడ కాయ్‌రాజాకాయ్ అంటూ ఆ ఆటపై పందేలు కాస్తున్నారు. వందలు, వేలు కాదు.. ఏకంగా లక్షలాది రూపాయలు బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత క్రికెట్ బెట్టింగ్ మాయలో పడి అప్పలఊబిలో కూరుకుపోతున్నారు. ఆన్‌లైన్‌లోనూ జూదాలు అందుబాటులో ఉండడంతో చాలా మంది దీనికి బానిసలై సరస్వాన్ని కోల్పోతున్నారు. పోలీసులు దీనిపై నిఘా ఉంచినా పూర్తి స్థాయిలో ఈ జూదాన్ని నియంత్రించలేని పరిస్థితి ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారు. ముఖ్యంగా క్రికెట్ ప్రేమికులు ఎక్కువ. క్రికెట్ మ్యాచ్ వస్తే టీవీలకు అతుక్కుపోయి ఆ ఆటను చూస్తూ ఆస్వాదిస్తారు. కుటుంబం అంతా కలిసి చూసే ఆట క్రికెట్. మారిన పరిస్థితుల దృష్ట్యా క్రికెట్ ఆటగా మర్చిపోయి జూదంగా మారింది. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచకప్‌లో జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బుకీల అవతారం ఎత్తి దీనిని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని వారి నుంచి డబ్బులు గుంజేస్తున్నారు. ఒక్కసారి దీనికి అలవాటు పడిన వారు అందులో కూరుకుపోయి అప్పులపాలు అవుతున్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు, వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఈ బెట్టింగ్‌లు ఆడుతున్నట్లు తెలుస్తోంది.

బంతిబంతికీ బెట్టింగ్..

బెట్టింగ్‌లో అనేక రకాల పద్ధతులను అవలంభిస్తున్నారు. గతంలో మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారన్న దానిపై మాత్రమే బెట్టింగ్ జరిగేది. ఐపిఎల్ వచ్చాక బెట్టింగ్‌లోనూ కొత్త పద్ధతులు వచ్చాయి. బంతిబంతికీ బెట్టింగ్ కాసే అవకాశాలను కల్పించారు. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారు.? ఎన్ని పరుగులు సాధిస్తారు..? స్కోర్ సరి సంఖ్య వద్ద నిలుస్తుందా..? బేసి సంఖ్య వద్ద నిలుస్తుందా..? ఎక్కువ పరుగులు ఎవరు చేస్తారు..? వికెట్లు ఎవరు ఎక్కువ తీస్తారు.? ఇలా ఒక్కటేమిటి బంతిబంతికీ బెట్టింగ్ కాస్తున్నారు. పదులు, వందలు కాదు... వేలు, లక్షల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లోనూ బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. సెల్‌ఫోన్ల ద్వారానే ఈ బెట్టింగ్‌లు ఆడేస్తున్నారు. ఇలా బెట్టింగ్‌కు బానిసైన వారు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు.

పోలీసుల కళ్లు గప్పి...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు పెద్ద ఎత్తున దృష్టి సారించారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే ప్రతిసారీ పోలీసులు బెట్టింగ్‌లు ఆడేవారికి హెచ్చరికలు జారీ చేస్తారు. ఈ సారి వరల్డ్ కప్ ప్రారంభం సమయంలో కూడా ఎస్పీ స్థాయి అధికారులు బెట్టింగ్‌పై గట్టి హెచ్చరికలు చేశారు. బెట్టింగ్ ఆడితే అరెస్టు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు. అయినా వీరి హెచ్చరికలను బేఖాతర్ చేసి బెట్టింగ్‌లు ఆడతున్నారు. సాంకేతికతను ఉపయోగించి, పోలీసులకు అనుమానం రాకుండా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గతంలో చాలాసార్లు బెట్టింగ్ జూదరులను పోలీసులు అరెస్టు చేసి, కటకటాల వెనక్కి పంపారు. గతేడాది అయితే అంతర్‌రాష్ట్ర క్రికెట్ బుకీని అనంతలో అరెస్టు చేశారు. ఇలా ఓ వైపు పోలీసుల అరెస్టులు జరుగుతున్నా బెట్టింగ్ మాత్రం అదుపులోకి రావడం లేదు. వైరస్‌లా విస్తరిస్తున్న ఈ క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు పూర్తి స్థాయి నిఘా ఉంచి నియంత్రించకపోతే భవిష్యత్తులో దీని బారిన పడి అనేక మంది వారి జీవితాలను నాశనం చేసుకునే ప్రమాదం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

వడ్డీ వ్యాపారుల జోరు

క్రికెట్ బెట్టింగ్‌లో మరో కోణం వడ్డీ వ్యాపారం. క్రికెట్ జూదం ఆడేవారు ఇతరుల వద్ద అప్పులు చేస్తుంటారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని వడ్డీ వ్యాపారులు వేలాది రూపాయలను అధిక వడ్డీలకు ఇస్తున్నారు. రోజు వడ్డీ పేరుతో డబ్బులు ఇస్తున్నారు. ఆరోజు మ్యాచ్‌లో గెలిస్తే డబ్బులను ఇచ్చేస్తున్నారు. ఒక వేళ మ్యాచ్ ఓడిపోతే తీసుకున్న డబ్బులకు పత్రాలు రాయించుకుంటున్నారు. ఇలా చాలా మంది వడ్డీ వ్యాపారుల ఉచ్చులో ఇరుక్కుపోతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు జూదం, మరో వైపు అధిక వడ్డీలతో జూదరులు సర్వసం కోల్పోతున్నారు. జూదం నిర్వహించే వారు కూడా బుకీ అవతారం ఎత్తి డబ్బులను తీసుకుంటున్నారు. బెట్టింగ్ ఆడేవారి నుంచి మ్యాచ్ కలిస్తే ఈ బుకీలు 30 నుంచి 40 శాతం మొత్తాన్ని కమిషన్ రూపంలో తీసుకుంటున్నారు. ప్రపంచ కప్‌లో ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌లు ఒక ఎత్తు అయితే ఆదివారం నాడు జరిగే ఫైనల్ మ్యాచ్‌కు పెద్ద మొత్తంలో మెట్టింగ్ రూపంలో చేతులు మారే అవకాశం కన్పిస్తోంది. పట్టణ కేంద్రాల్లో మకాం వేసి ఫైనల్ మ్యాచ్‌లో పెద్ద మొత్తంలో బెట్టింగ్ నిర్వహించి డబ్బులు కొల్లగొట్టాలని బుకీలు పతకం రచించినట్లు సమాచారం. ఇలాంటి వాటిపై పోలీసులు నిఘా ఉంచి బుకీలను అదుపులోకి తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌ను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండలో కళాశాల బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని నిరసన తెలిపి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వీరేష్ మాట్లాడుతూ గుడిబండలో కళాశాల విద్యార్థులకు హాస్టల్ సదుపాయం లేక విద్యార్థులు మడకశిర, హిందూపురం, అనంతపురం, తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాస లకు గురవుతున్నారన్నారు. ఇక్కడ ప్రభుత్వ కళాశాల ఉన్నప్పటికీ వసతి గృహం లేనందున విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ కళాశాల హాస్టల్‌ను ప్రారంభించి ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, వినోద్, గౌతమ్, పునీత్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థి ఆదర్శతో ప్రిన్సిపల్ గోపాల్, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంజెబి విద్యార్థి

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు స్థానికమహాత్మా జ్యోతిబా పూలే(ఎంజెబి) పాఠశాల విద్యార్థి ఆదర్శ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోపాల్ గురువారం తెలిపారు. పదో తరగతి విద్యార్థి ఆదర్శ ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా పిఇటి రామకృష్ణ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో నరేష్, వెంకటరమణ, హనుమంతురాయుడు, మూర్తినాయక్, ప్రభాకర్, కోటప్ప, అశోక్, ముత్యాలప్ప, సతీష్ మంజునాథ్, శ్రీవిద్య, గీత, స్వాతి, మంజుల, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కులగణన

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ నెల 27వ తేదీ నుంచి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కుల గణన నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్ ఆదేశించారు. ఈ అంశంపై గురువారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ మీరు గ్రామాల్లో ఇంటి వద్దకు వెళ్లి కులాల వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో పొందుపరచాలన్నారు. ప్రజల కులంతో పాటు ఉపకులం, తదితర వివరాలు సేకరించాలన్నారు. సర్వేలో 20 అంశాలకు సంబంధిం చిన ప్రశ్నలతో నమూనాపత్రం పూర్తి చేయాలని, ఈ కార్యక్రమాన్ని త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించా రు. సమావేశంలో ఎంపిడిఒ బరాన్‌సాబ్, పంచాయతీ కార్యదర్శులు గంగాధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక వెలుగు కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సుదర్శన్‌బాబు ఆధ్వర్యంలో 'కుల గణన'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో కులగణనతో పాటు సేకరించాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, ఇఒఆర్‌డి శివన్న, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీతోనే ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి-మడకశిర

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఎఐపికి ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, రాష్ట్ర నాయకుడు కెటి.శ్రీధర్ తెలిపారు. రొళ్లలో గురువారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బచ్చలయ్యపాలెం నరసింహమూర్తి, కన్వీనర్లు గౌడప్ప, వరదరాజులు, బాబు, ప్రకాష్, దొడ్డమారప్ప, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

'వై ఎపి నీడ్స్ జగన్'లో వైసిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-మడకశిర

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. రొళ్లలో గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'వై ఎపి నీడ్స్ జగన్" కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రొళ్ల సచివాలయం-2లో ఏర్పాటు చేసిన 'సంక్షేమ పథకాల బోర్డ్'ను ఆవిష్కరించారు. వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సంక్షేమం, మేనిఫెస్టో హామీలు, రాష్ట్ర అభివృద్ధి గణాంకాలతో కూడిన బ్రోచర్‌తో ప్రతి గడపకూ వెళ్లి ప్రజల కు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆజాద్, తహశీల్దార్ హసీనా సుల్తాన్, జడ్పిటిసి అనంతరాజు, జెసిఎస్ కన్వీనర్ నాగేంద్ర, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచులు రాజన్న, శ్రీరామప్ప, దొడ్డయ్య, ఎంపిటిసిలు జగదీష్, లింగరాజు, యారగుంటేశ్వర, సింగిల్‌విండో అధ్యక్షులు మోతిరామ్‌నాయక్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మేలును ప్రజలకు వివరిద్దాం : ఎమ్మెల్యే

పెనుకొండ : రాష్ట్ర ప్రభుత్వం, సిఎం జగన్ చేసిన మేలును ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్యే శంకర నారాయణ పిలుపునిచ్చారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్‌ఫరూఖ్‌ఖాన్ అధ్యక్షతన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన ముందుగా సచివాలయం ముందు ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాల లబ్ధి డిజిటల్ బోర్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు ప్రజలకు ఎందుకు మంచి చేయలేకపోయారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, కౌన్సిలర్లు, టౌన్ కన్వీనర్ నరసింహ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ చేయడానికి భూమిపూజ చేస్తున్న సర్పంచి గంగమ్మనాగరాజు

తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-మడకశిర

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మంజూరైన జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరా కార్యక్రమం చేపడుతున్నట్లు సర్పంచి గంగమ్మనాగరాజు తెలిపారు. మండల పరిధిలోని కళ్లుమర్రి పంచాయతీకి సంబం ధించిన గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొన్న దృష్ట్యా జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని మంజూరు చేశారు. అందులో భాగంగా గురువారం తడకలపల్లిలో పైపులైన్ ఏర్పాటుకు సర్పంచి భూమిపూజ చేశారు. ఈ పనులు పూర్తయితే పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తాగనీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరదరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టులో ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్

హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుండి 28వ తేదీ వరకు చెన్నైలో జరుగుతున్న 13వ జాతీయస్థాయి సీనియర్ పురుషుల టోర్నమెంటులో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ధర్మవరానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. క్రీడాకారులు జింకా ఉదయ్ కిరణ్ ,యం.నాగేంద్ర బాబు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఎపి హాకీ సంఘం ఉపాధ్యక్షులు, శ్రీ సత్యసాయి జిల్లా జనరల్ సెక్రెటరీ సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షులు బివి. శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు పళ్లెం వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జట్టుకు టీమ్ మేనేజర్‌గా జిల్లా హాకీ సంఘం జాయింట్ సెక్రెటరీ అయిన ధర్మవరానికి చెందిన ఎస్ అరవింద్ గౌడ్ వ్యవహరిస్తున్నారని తెలిపారు.

అనుమతులు లేని మందులు విక్రయిస్తే చర్యలు

హిందూపురం : పట్టణ వ్యాప్తంగా పురుగుల మందుల దుకణాదారులు అనుమతులు లేని మందులను విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకొంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. విజిలెన్స్ సిఐ వెంకటరమణ, విజిలెన్స్ వ్యవసాయ అధికారి వాసుప్రకాష్, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ పట్టణంలోని భైరవేశ్వర, భూమిపుత్ర వ్యవసాయ పురుగుల మందుల దుకణాలను గురువారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, షాపులో ఉన్నా పురుగుల మందులను పరిశీలించారు. నాణ్యత లేని మందులను, గడువు ముగిసిన మందులను, నిషేదించిన మందులను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

గోరంట్ల రూరల్ : 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని, చంద్రబాబుతోనే ఎపికి భవిష్యత్తు అనిటిడిపి జిల్లా అధ్యక్షుడు బి.కె. పార్థసారథి పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా గురువారం ఆయన మండల పరిధిలోని గౌనివారిపల్లి పంచాయతీలో పర్యటించారు. టిడిపి, జనసేన నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. పార్థసారథి మాట్లాడుతూ సిఎం జగన్ ఇప్పటికే రూ. 11 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అంధకా రం చేశారని ధ్వజ మెత్తారు. టిడిపి అధికారంలోకి వస్తే హంద్రీనీవా ద్వారా గోరంట్ల ప్రాంతంలోని చెరువులను నింపుతామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి దేవా నరసింహప్ప, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, చంద్ర, నీలకంఠారెడ్డి, ఫిరోజ్‌బాషా, జయరాం, వెంకటరంగారెడ్డి, మనిశేఖర్‌రెడ్డి, నరేంద్ర, భరత్‌కుమార్, కార్తీక్, జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గౌనివారిపల్లిలో పర్యటిస్తున్న టిడిపి, జనసేన నాయకులు



టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పిలుపునిచ్చారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం జనసేన-టిడిపి ఆత్మీయ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి భవిష్యత్తు కార్యాచరణ, పలు అంశాలపై చర్చించారు. పార్థసారథి మాట్లాడుతూ ఉమ్మడి మేనిఫెస్టో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' అనే కార్యక్రమం త్వరలోనే ప్రారంభం అవుతుందన్నా రు. వైసిపి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతు న్నారన్నారు. ఈ తరుణంలో అన్నివర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రాక్షస వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపి జనసేన, టిడిపి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని తెలిపారు. వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయా రన్నారు. 2024లో టిడిపి-జనసేన పొత్తులో గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో ప్రభాకర్‌చౌదరి, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దార్ ముషార్‌వలికి వినతి పత్రం అందజేస్తున్న బేగార్లపల్లి ప్రజలు

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

మడకశిర : పట్టణ సమీపంలోని బేగార్లపల్లి గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని గురువారం గ్రామ స్తులు తహశీల్దార్ ముషార్ వలికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 865 కుటుం బాలు ఉన్నాయని, బీసీ, ఎస్సీ సామాజిక వర్గం ప్రజలు మృతిచెందితే వంక సమీపంలో శవాలను పూడ్చుతు న్నామన్నారు. భవిష్యత్తులో ఇబ్బందిగా మారే అవకాశం ఉందని, కావున శ్మశానవాటికకు స్థలం కేటాయించా లని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో స్థలం ఉంటే పరిశీలించి ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో రామాంజనేయులు, మల్లికార్జున, చందు, మహిళలు ఉన్నారు.

గుడికట్ల సంబరాల పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తచెరువు : ఆది నుంచి వస్తున్న కురుబల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఆయన గురువారం మండల పరిధిలోని లోచర్ల గ్రామంలో గుడికట్ల సంబరాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీలు కురుబల సంస్కృతి, సంప్రదాయాలు, పోరాటయోధుల చరిత్రను ప్రజలకు తెలియ జెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన కురుబలకు ఎంపి, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు శివానంద, జనరల్ సెక్రటరీ రమేష్, ప్రచార కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు పవన్, ప్రభాకర్, కమ్మన్న, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘనంగా సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. బ్యాంకు చైర్మన్ బండారు ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వారోత్సవాల్లో అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘం బలోపేతం చేయడానికి డిజిటలైజేషన్ కోసం సాంకేతికతను మెరుగుపరుచుట తదితర విషయాలపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఇనయతుల్లా, రమేష్, సిబ్బంది బాబు, సెక్రటరీ తుమ్మల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధర్మవరం పట్టణంలో పట్టణం దుర్గానగర్‌లో గురువారం చోటు చేసుకుంది. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గానగర్‌కు చెందిన శ్రీనివాసులు(45), తన భార్య జయసుధలు చేనేత కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. కూలి మగ్గం నేసుకుంటూ జీవనం సాగించేవారు. కూలి మగ్గంలో తగిన ఆదాయం లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం భార్య బయటకు వెళ్లిన సమయంలో శ్రీనివాసులు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముసాయిదా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు కృషి

కలెక్టర్ అరుణ్ బాబు



విడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ముసాయిదా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. గురువారం విజయవాడలోనిఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఓటరుజాబితా నిష్పత్తి, లింగ నివృత్తి, జాబితాలో ఓటర్లు చేర్చడం తొలగించడం తదితర అంశాలపై ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి ఫారం - 6 పెండింగ్ 30 శాతం, ఫారం - 7 పెండింగ్ 15 శాతం, ఫారం - 8 పెండింగ్ 10 శాతం ఉందన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు తగు ఆదేశాలు చేశామన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి తగిన ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతిచెందిన, మారిపోయిన, డబల్ ఎంట్రీ ఓటర్లపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ వారి అభ్యంతరాలను, అభ్యర్థనలు కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే మీడియాలో వచ్చిన వార్తలపై కూడా దృష్టి సారించి వాస్తవాలను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్ల నమోదు పై దృష్టి పెట్టామన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా తప్పులు లేకుండా రూపొందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒకే రకమైన ఫోటోలు ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి మారిపోయినవి, మృతులు, ఒకే ఇంటి నెంబర్ పై 10 కన్న ఎక్కువ ఓట్లు, ఒక వ్యక్తి పేరున రెండు అంతకన్నా ఎక్కువ ఓట్లు ఉండడం లాంటి వాటి తొలగింపునకు గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో రూపకల్పనకు బాధ్యతాయుతంగా అధికారులు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, కదిరి ఆర్డీవో వంశీకృష్ణ రెడ్డి, ధర్మవరం ఆర్డీవో రమేష్ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు భాస్కర్, మైముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి 98వ జయంతి వేడుకలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక డిపిటిఒ కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ ఇన్‌ఛార్జులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి భక్తులు పర్యాటకులు రానున్నారన్నారు. ఈనెల 18 నుంచి నవంబర్ 24 వరకు ఈ జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. ఈ వేడుకలలో పాల్గొనడానికి వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా 70 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్, కొత్తచెరువు, బుక్కపట్నం, ధర్మవరం రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి, కదిరి, హిందూపురం, పెనుకొండ, అనంతపురం నుంచి పుట్టపర్తికి బస్సులు నడుపుతామన్నారు. అన్ని డిపో మేనేజర్లకు, ట్రాఫిక్, గ్యారేజీ ఇన్‌ఛార్జులకు తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. రావడానికి పోవడానికి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా రవాణా అధికారి

నిబంధనలు లేకుండా పరీక్ష ఫీజు కట్టించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులతో పరీక్ష ఫీజులు కట్టించుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బిసి కళాశాల వసతి గృహంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎస్.కె యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలకు మొదటి సెమిస్టర్, 3వ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షల ఫీజు కట్టడానికి ఈ నెల 20వ తేదీ చివరి రోజు అన్నారు. డిగ్రీ చదువుతున్న ప్రతి విద్యార్థి జగనన్న విద్యా దీవెన ఆధారంగానే చదువును కొనసాగిస్తున్నారన్నారు. అయితే కళాశాల యాజమాన్యాలు విద్య దీవెనకు సంబంధం లేకుండా కళాశాల ఫీజు కడితేనే పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని చెప్పడం సరైంది కాదన్నారు. కళాశాల ఫీజులతో సంబందం లేకుండా విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజును కట్టించుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షా ఫీజుయ కట్టించుకోని యాజమాన్యాల పైన యూనివర్సిటీ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నిహాల్, రమణ, నవీన్, మనోజ్, కేశవ్, గురు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాబావలి

'టిడిపి, జనసేన పొత్తు విజయానికి నాంది'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



సమావేశంలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, చిలకం తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో టిడిపి, వైసిపి కలవడమే విజయానికి నాంది అని హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ అన్నారు. గురువారం హిందూపురం పట్టణంలోని బాలకృష్ణ నివాసం వద్ద టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలకృష్ణతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షులు పార్థసారథి, జనసేన నాయకులు ఆకుల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన పార్టీ నాయకుల సమక్షంలో జై బాలయ్య, జై జై బాలయ్య ఆడియో క్యాసెట్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్రంలో ఉన్న అరాచక పాలనను సాగనంపేందుకు టిడిపి, జనసేన కలవడం శుభ పరిణామం అని అన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి సైకోగా మారి రాష్ట్రాన్ని అధోగతి పట్టించారని విమర్శించారు. హిందూపురం పట్టణంలో జరిగిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర సందర్భంగా వైసిపి వాళ్ళు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అందరికీ ఆటంకం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. మహానుభావులైన జాతీయ నాయకుల ఫోటోలో కింద వేసి పై భాగంలో వైసిపి నాయకులు ఫోటోలు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. హిందూపురం టిడిపి కంచుకోటను బద్దలు కొట్టడానికి ఎవరితరం కాదన్నారు. రాబోవు 2024లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో అక్రమ కేసులు పెట్టి ప్రతి పక్ష పార్టీలకు భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినప్పటికీ వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటామన్నారు. టిడిపి జనసేన కలిసి రాక్షస పాలన పోయేవరకు పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక్క సాగు నీటి ప్రాజెక్టు సైతం పూర్తి చేయని అసమర్ద ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించారే తప్ప ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉన్నా ఉద్యోగాలను పీకేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా ఉమ్మడిగా పని చేస్తామన్నారు. వైసిపీ నేతల అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు, దురాక్రమణలు, దోపిడీని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షులు పార్థసారథి మాట్లాడతూ హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారనిహెచ్చరించారు. హిందూపురంలో వైసీపీ సాధికార యాత్రలో ఎమ్మెల్యే బాలకృష్ణపై ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, అనిల్ కుమార్, అంజినప్ప, రమేష్‌కుమార్, అంజినప్ప, రాము, చంద్రమోహన్ యాదవ్‌తో పాటు టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జగన్ మరోసారి సిఎం అయితే రాష్ట్రం బీహార్‌లా తయారవుతుందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎర్రగుంట సర్కిల్లోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడిగా చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్చించుకున్నారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతోందన్నారు. కేతిరెడ్డి పాలనకు ఎప్పుడెప్పుడు ముగింపు పలకాలన్న ఆలోచనలతో స్థానిక ప్రజలు ఉన్నారన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే కేతిరెడ్డిపై ఛార్జిషీట్ వేస్తామని ఈ నాలుగున్నర ఏళ్లలో ఆయన చేసిన అరాచకాలు దౌర్జన్యాలు గురించి అందులో సాక్ష్యాలతో సహా ప్రచురిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, వేణుగోపాల్‌రెడ్డి, పోతుకుంటలక్ష్మన్న, గొట్లూరు శీన, నాగూర్ హుస్సేన్, పరిసేసుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, చట్టా లక్ష్మీనారాయణ, మేకల రామాంజినేయులు, కేశగాళ్లశీన, చిన్నూరు విజయ చౌదరి, జనసేననాయకులు బెస్తశ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. కదిరి రూరల్ మండలం బూరుగపల్లి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్దా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆపార్టీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి.వైసీపీ నాయకులు రెడ్డప్ప రెడ్డి, నాగరాజు, శ్యాంసుందర్ రెడ్డి, వాల్మీకి శంకర్ తెలిపారు. కొత్తచెరువులోనిరెండవ సచివాలయం వద్ద గురువారం వైసీపీ జెండాను ఎగురవేశారు. వై నీడ్ జగన్ కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షాజహాన్, కృష్ణమూర్తి, భాస్కర, ఎల్లప్ప, అశోక్, పెయింటర్ కేశవ, సుబ్బారావు, ఎంపీటీసీ రఫీ తదితరులతో పాటు వాలంటీర్లు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ఏపీకి జగన్ కావాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. మండలంలోని అప్రాచెరువు గ్రామ సచివాలయంలో బుధవారం సాయంత్రం 'వై ఎపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మొరెడ్డిగారి శారదమ్మ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వివరించారు. అనంతరం సచివాలయ ఆవరణంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ దివాకర్, కార్యదర్శి అలువేలు మంగమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, నాయకులు వెంకటరంగారెడ్డి, లింగమయ్య, ఈశ్వరయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బస్సుయాత్రపేరుతో దళితుల భవిష్యత్తుకు సమాధి

ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో దళితుల భవిష్యత్తుకు వైసీపీ సమాధి కడుతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తుంపర్తి పరమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, రాయదుర్గం నియోజకవర్గం వెట్టి అంజిబాబుపై అక్రమంగా కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశచరిత్రలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

బత్తలపల్లి : వివిధ పట్టణాలకు వెళ్లే వారికి ప్రధాన కూడలి అయిన బత్తలపల్లి కూడలిలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించకుండా అందరూ సహకరించాలని ట్రైనీ డీఎస్పీ ఏవి. పృథ్వీతేజ సూచించారు. గురువారం సాయంత్రం బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులుతో కలిసి కూడలిలో వ్యాపారాలు నిర్వహించుకునే వారికి, ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. వ్యాపారాలు నిర్వహించుకునేవారికి తాము సహకరిస్తామని అయితే వారు కూడా తాము చెప్పినవిధంగా సహకరించాలని సూచించారు. తమ దుకాణాల ముందు రోడ్డుపైన ఉన్న మార్కులోపు వాహనాలను, ద్విచక్రవాహనాలను ఆపివేసేలా వాహనదారులకు సూచించాలన్నారు. లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. తొలుత హెచ్చరిస్తామని అతరువాత మార్పు రాని పక్షంలో చర్యలు తప్పవని అన్నారు. ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే కుదరదన్నారు. సీరియల్ వారిగా వచ్చి ప్రయాణీకులను ఎక్కించుకుని వెళ్లాలన్నారు. ఇష్టారాజ్యంగా కూడలిలో ఎక్కడంటే అక్కడ ఆపి ప్రయాణీకులను ఎక్కించుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఆటోలలో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకుని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సులు కూడా ఇష్టారాజ్యంగా ఎక్కడబడితే అక్కడ ఆపకూడదన్నారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు 'యశోద' విద్యార్థులు

ధర్మవరం టౌన్ : అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జరిగినజిల్లా స్థాయి హ్యాండ్‌బాట్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. పాఠశాలలో 9వతరగతి చదువుతున్న వర్షిత, నిహారిక హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభకనబరచి ఈనెల 18,19,20 తేదీలలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఈనెల 10,11,12 తేదీలలో విజయవాడ పటమట హైస్కూల్ క్రీడామైదానంలో అండర్-17 సెపక్ అక్రా పోటీలలో బాలికల విభాగంలో హని పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని డైరెక్టర్ తెలిపారు. వీరిని డైరక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని అన్ని వార్డులలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నాలుగవ వార్డులోని శాంతినగర్ వార్డు సచివాలయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయుచున్న పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం డిస్‌ప్లే బోర్డును వారు ఆవిష్కరించారు. అనంతరం కాచర్ల లక్ష్మీ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందని సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేముల జయరాంరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ వక్కల రమణయ్య, నాయకులు చాంద్‌బాషా, 8వ వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరి విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు

కదిరి టౌన్ : శ్రీ సత్య సాయి జయంతి సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యా సంస్థల అధ్వర్యంలో విద్యార్థులకు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మానవతా విలువతో కూడిన శ్రీ సత్య సాయి విద్యా విధానం యొక్క విశిష్టతను మండల స్థాయి, జిల్లాస్థాయి ,రాష్ట్రస్థాయిలలో మూడు విభాగాలుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కదిరి డివిజన్‌లో ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన 1560 మంది విద్యార్థులు ఈ వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. కదిరి బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న షేక్ ముస్తాన్ కి రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి లభించింది. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి గ్రామ సేవా ఇంచార్జ్ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ కదిరికి రాష్ట్రస్థాయి బహుమతి రావటం ఆనందంగా ఉందన్నారు. ఈ బహుమతిని ఈనెల 21 వ తేదీన జరుగుతున్న సేవాసంస్థల కార్యక్రమంలో ప్రదానం చేస్తారన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. 3 వరోజు గ్రంథాలయ అధికారి ఎన్. ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఎంఇఒ నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల కోసం ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులైన డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, చిత్రపటాలకు పూలమాలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు డిఇ శివశంకర్, ఉపాధ్యాయులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కదిరిలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ ఉద్యమ పితామహులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఆయ్యంకి వెంకట రమణయ్య రంగనాథన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణ కిషోర్ రెడ్డి, పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది చాంద్‌బాసా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రజల సమస్యలు పరిష్కరించడమే గుడ్ మార్నింగ్ అనే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక 8వ వార్డులో వారు గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి వార్డు ప్రజలు డ్రయినేజీ, వీధి దీపాల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ డీఈ వీరేష్, వార్డు కౌన్సిలర్ బ్రహ్మయ్య, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, నాయకులు కాచర్ల అంజి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబ్ బాషా, శ్యాంసన్, హౌసింగ్ ఏఈ బాలాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్గో సేవల్లో కదిరి డిపో ఉద్యోగుల ముందంజ

కదిరి టౌన్ : కార్గో డోర్ డెలివరీలో కదిరి డిపో ఉద్యోగులు ముందజలో ఉన్నట్లు అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ తెలిపారు. కార్గో మాసోత్సవాల డోర్ డెలివరీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కదిరి డిపో ఉద్యోగులు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుతుండటం పట్ల కదిరి డిపో అసిస్టెంట్ మేనేజరు హరిత, హరిమోహన్ హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేస్తాం

పుట్టపర్తి అర్బన్ : ప్రభుత్వం చేపట్టిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేస్తామనికలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. గురువారం విజయవాడ సెక్రటేరియట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యకు సంబంధించి జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాల గురించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ కార్యదర్శి వివరించారు. జిల్లాలో స్థూల నమోదు నిష్పత్తికి సంబంధించిన లక్ష సాధనలో భాగంగా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో మొదటి తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 1. 80 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. మరికొంతమంది పాఠశాల బయట ఉన్నట్లు గుర్తించామన్నారుప్రాధాన్యత భవనాలను నిర్ణీత గడువులోగా నిర్మించడానికి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ లలిత కుమారి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, ఏపీవో ప్రకాష్ రెడ్డి, టూరిజం మేనేజర్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటి రాముడి వర్ధంతి

బత్తలపల్లి : మండలంలో బీసీ వర్గాల నాయకుడు, మాజీ సర్పంచి కోటి రాముడి వర్ధంతిని గురువారం నిర్వహించారు. బత్తలపల్లిలోని కోటి రాముడి స్మృతివనంలో కోటిరాముడు పదకొండవ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుటుంబ సభ్యులతో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలోని వెనుకబడిన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన కోటి రాముడు రాజకీయాలలో ప్రవేశించి తనకంటూ ప్రత్యేకంగా ఒక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోటిరాముడు కుమారుడు ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, కోటి రాముడు భార్య యల్లమ్మ, జెడ్పీటీసీకోటి సుధ, ఎంపీటీసీకోటి నరేష్ కూమార్, ఉప సర్పంచి కోటి గోపీనాథ్, ఎజిఎం ట్రేడర్స్ నిర్వహకులు కోటి సురేష్, కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సర్పంచులు కమతం వరలక్ష్మి, అక్కెం కాశీమ్మ, కో ఆప్షన్ మెంబర్ కరీంసాబ్, సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశన్న, బండి వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామంలో నాగరాజును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులు గురువారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొటిపి గ్రామంలో ఈ నెల 3న రాత్రి ఇదే గ్రామానికి సంబంధించిన కొంతమంది నాగరాజుకు మద్యం తాగించి ఊరు బయటకు తీసుకువెళ్లి రాత్రి పది గంటల పైన హత్య చేశారని ఆరోపించారు. అదే రోజు రాత్రి ఎవరూ లేని సమయంలో నాగరాజును వారి ఇంటివద్ద పడుకోబెట్టి వెళ్లారన్నారు. కుటుంబసభ్యులకు ఎవరిపైన అనుమానం రాక పోవడంతో నాగరాజును ఖననం చేశారన్నారు. అయితే హత్య చేసినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృత దేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు తండ్రి నారాయణప్ప, కొటిపి గ్రామస్తులు ఆనగానపల్లి సోమయ్య, బాలు, రామన్న, గోవిందు, సమర, సురేష్, నాగరాజు, నారాయణ, సరస్వతమ్మ, సిపిఎం నాయకులు ఎంవి రమణ, వి.ఆర్. రాము, న్యాయవాది ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రూరల్ స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

క్రీడా సామగ్రి అందజేత

బత్తలపల్లి : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన గోపాల్ నాయక్ తన వంతు సాయంగా క్రీడా సామాగ్రిని అందజేశారు. మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గోపాల్ నాయక్ క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ క్రీడా సామాగ్రిని గురువారం రామాపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్గో కస్టమర్లకు బహుమతులు

ధర్మవరం టౌన్ : కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలలో భాగంగా ధర్మవరం డిపో పరిధిలోనికస్టమర్లకు ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ బహుమతులను గురువారం ప్రదానం చేశారు. అక్టోబరు 26 నుంచి ఈనెల 15 వరకు డోర్ డెలివరీ పార్సెల్ బుక్ చేసిన కస్టమర్లలో ధరణి స్కిల్ వారి సౌజన్యంతో స్థానిక బస్టాండ్ ఆవరణంలో లక్కీ డ్రిప్ ద్వారా ఎంపిక చేసిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. జీవన్‌రెడ్డి, మంజులకు ప్రథమ, ద్వితీయ బహుమతులకింద పట్టుచీరలను ఆర్ఎం చేతులమీదుగా ప్రదానం చేశారు. అదేవిధంగా అదేవిధంగా ఈనెల 26న మాంగల్యశిల్క్స్ సౌజన్యంతో కూడా లక్కీడిప్ ద్వారా నలుగురు విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందని ఆర్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిపో కార్యాలయ ఎస్‌టిఐ షాషావలి, ఎఇ సికిందర్, ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ప్రేమకుమార్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తాఫా, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కెఆర్ఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని గోకులం ప్రాథమిక పాఠశాలలో జరిగిన నాడు నేడు పనులను ఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. గురువారం పాఠశాలను సందర్శించిన ఆయన గ్రానైట్, టైల్స్, ప్లంబింగ్ పనులు, ఎలక్ట్రికల్ పనులు బాగా చేశారని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పాఠశాలలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నాడు నేడు పథకం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ రంగనాథరావు, ఎఇ బాబు, సచివాలయ ఇంజనీరు బాలు నాయక్, హెచ్ఎం రాజారాణి, పీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ

ముదిగుబ్బ : పట్టణంలోని 16 వ వార్డులో టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో లోని సూపర్ - సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, నంద, పెద్దన్న, కిష్టప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

23న ఓబవ్వ జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిరలో ఈ నెల 23వ తేదీ నిర్వహించే వీర వనిత వణికే ఓబవ్వ జయంత్యుత్సవాలను విజయ వంతం చేయాలని మాల మహానాడు సంఘం అధ్యక్షుడు పాండురంగ మూర్తి, కార్యదర్శి సోముకుమార్, జయరామప్ప, సోమన్న, కాచికుంట వెంకటేష్, రాజశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామంలో తిరిగి ఆహ్వాన పత్రిక లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, జయరామప్ప, మధు, శ్రీనివాస్, గంగాధర్, మూర్తి, బాలు, శబరీష్ పాల్గొన్నారు.



జయంత్యుత్సవాల ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తున్న నాయకులు

జర్నలిజం పవిత్రమైన వృత్తి

ప్రజాశక్తి-మడకశిర

సమాజంలో పాత్రికేయ వృత్తి ఎంతో విలువలతో కూడుకున్నదని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రేకులకుంట హనుమంతరాయప్ప తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికార స్థానాల్లో ఉన్న వ్యక్తులను జవాబుదారీగా ఉంచడమే జర్నలిజం ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం సక్రమంగా ఉందా లేదా అని తెలుసుకోవాలంటే పత్రికా రంగాన్ని పరిశీలిస్తే చాలు అన్నారు. పత్రికల ఆధారంగానే స్వాతంత్ర్య సమరం సాగిందన్నారు. గాంధీ నుంచి అంబేద్కర్ వరకూ అందరూ పత్రికల్లో పనిచేశారన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

కదిరి టౌన్ : పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ నాయకులు న్యాయవాది సివి. కృష్ణమూర్తి మాట్లాడుతూ మున్సిపాలిటీలో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు యూనిఫామ్, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వలేదన్నారు. కార్మికులకు 12 సంవత్సరాలు 18 సంవత్సరాలు 24 సంవత్సరాలు స్పెషల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాల్సుందన్నారు. ఈనెల 28 లోపు సమస్యలు పరిష్కరించకపోతే 29న ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆంజనేయులు, మనోహర్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్దూ బాషాదినోత్సవం

హిందూపురం : పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ మురళిమోహన్ ఆధ్వర్యంలో ఉర్దూ బాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉర్దూ విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమం లో ఉర్దూ అధ్యాపకులు అల్తాఫ్ హుసేన్, అయిషా తదితరులు పాల్గొన్నారు.

'పది' స్టేట్ టాపర్‌కు ఎమ్మెల్యే అభినందనలు

హిందూపురం : పదవ తరగతిలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థి ప్రియంవదను ఎమ్మెల్యే బాలకృష్ణ అభినందించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యార్థినిని పిలిపించి ఇంటర్ ఇంకా మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పదవ తరగతి ఫలితాల్లో స్టేట్ టాపర్ ప్రియంవదను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

బస్సును ఢీకొన్న ఆటో.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలోని రాట్నాలపల్లి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. మండల పరిధిలోని సంజీవపల్లికి చెందిన ఈశ్వరయ్య తన ఆటో లో కుటుంబ సభ్యులతో కలిసి కదిరి మండలంలోని కుంట్లపల్లి గ్రామంలో బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రా మం బయల్దేరారు. మార్గమధ్యలో రాట్నాలపల్లి బస్టాప్ వద్ద ఆగి ఉన్న బస్సును వెనుక వైపు నుంచి అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆటోలో ఉన్న ఈశ్వరయ్యతో పాటు భార్య, అత్త, మామలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ లింగన్న, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108లో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

ప్రజాశక్తి-కొత్తచెరువు

గ్రంథాలయాల స్థాపనకు ఉద్యమకారులు చేసిన సేవలు మరువలేనివని, ప్రతిఒక్కరూ వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు. స్థానిక గ్రంథాల యంలో గురువారం గ్రంథాలయ ఉద్యమ నాయకులు, డాక్టర్ ఎస్ఆర్. రంగనాథ్, పొట్లూరి నాగభూషణ్, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడు తూ గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థలకు రావాల్సిన నిధులను సకాలంలో చెల్లించకపోవడం వల్ల మనుగడ కష్టమవుతుం దన్నారు. పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమం లో విశ్రాంత ఎంపిడిఒ మహమ్మద్, పాఠకులు రామాచారి, నరసింహులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక గ్రంథాలయంలో అధికారి నాగరాజు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పొతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాల వేసి స్మరించుకున్నారు. కార్యక్ర మంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి అర్పిస్తున్న పాఠకులు

లేపాక్షి : 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో అధికారి జయసింహ రాజు గ్రంథాలయ ఉద్యమకారుల గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గుడిబండ : గ్రంథాలయం సేవలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయం అధికారి కమలనాభరావు సూచించిరు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపన్యాసకులు బసవరాజు, డాక్టర్ బాబయ్య, సురేంద్ర, పాఠకులు పాల్గొన్నారు.

'వై ఎపి నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

అమరాపురం : 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి జయప్రదం చేయాలని జడ్పిటిసి స్వారక నరసింహమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం-2 పరిధిలో జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించగా జడ్పిటిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు వివరించే కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొనకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాలంటీర్లు హాజరుకాక పోవడంపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌పై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి నాగముని, జెకె.నరసింహమూర్తి, పేలుబండ ప్రసాద్, త్రిలోక్‌నాథ్, నారాయణ, శివకుమార్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండల పరిధిలోని ఆర్.మరువపల్లి సచివాలయంలో ఏర్పాటుచేసిన డిజిటల్ బోర్డును ఎంపిపి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అలాగే రొద్దం సచివాలయ-2 వద్ద ఎంపిపి వైసిపి నాయకులతో కలిసి వైసిపి జెండాను ఆవిష్కరించి, 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జెట్టి మారుతిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ ఆర్.ఎ.రవిశేఖర్ రెడ్డి, జెట్టి అంజనరెడ్డి, వాలంటీర్లు, గృహ సారథులు, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.



రొద్దంలో వైసిపి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి చంద్రశేఖర్, వైసిపి నాయకులు